సాక్షి ప్రకాశం
సోమవారం | 6 | ఫిబ్రవరి | 2023



ప్రజా సహకారంతో ఆలయాల అభివృద్ధి

ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. - 8లో..



వివాహిత అనుమానాస్పద మృతి

అత్తింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన గుడ్లూరు మండలం రావూరులో చోటుచేసుకుంది. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30 /20

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

శ్రీశైలం బ్రహ్మోత్సవాలకు హాజరుకండి

- మంత్రి సురేష్, టీటీడీ చైర్మన్ వైవీకి ఆహ్వానం



వైవీ సుబ్బారెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న డాక్టర్ కనకదుర్గ

మార్కాపురం టౌన్: ఈనెల 18న శివరాత్రి మహా పర్వదినం సందర్భంగా శ్రీశైలంలో జరిగే భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారి బ్రహ్మోత్సవాలు, కళ్యాణానికి హాజరుకావాలని శ్రీశైల దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలు, కౌన్సిలర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ ఆదివారం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, పురపాలకశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి ఆహ్వాన పత్రిక అందించారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు.

నేడు సి ఫర్ కాస్ట్ పుస్తక సమీక్ష

ఒంగోలు టౌన్: ప్రఖ్యాత పత్రికా సంపాదకుడు సతీష్ చందర్ రచించిన ×సి ఫర్ కాస్ట్₹ పుస్తక సమీక్ష సభ ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్నట్లు బ్లూ వింగ్ ఫౌండేషన్ చీఫ్ అడ్వైజర్ డాక్టర్ శివరామ కృష్ణ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం కార్యక్రమం కరపత్రాన్ని విడుదల చేశారు. బ్లూ వింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో పుస్తక రచయిత సతీష్ చందర్, ప్రముఖ కవి జయరాజు హాజరుకానున్నారని తెలిపారు. హిందుస్థాన్ పెట్రోలియం చీఫ్ మేనేజర్ రెబ్బా అంబేద్కర్ పుస్తకాన్ని పరిచయం చేయనున్నారని చెప్పారు. సభలో 1992 నుంచి 2022 వరకు కుల వ్యవస్థతో కూడిన సమాజంలో కుల రాజకీయాలు అనే అంశంపై సతీష్ చందర్ విశ్లేషించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రకాశం, నెల్లూరు జిల్లాల కోఆర్డినేటర్లు మెడబలిమి కోటేశ్వరరావు, కూరపాటి విజయబాబు, కవి మొగలి దేవప్రసాద్, అంబేద్కర్ యువజన సంఘం నేతలు యలమంద బాబు, రాజు, ఆనంద్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


జాతీయ స్థాయి క్రికెట్ పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

ఒంగోలు: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ నెలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా జాతీయస్థాయి క్రికెట్ పోటీలు (డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కప్) నిర్వహించనున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్తర్ల శంకర్ బహుజన్ తెలిపారు. స్థానిక ఒంగోలు ప్రెస్‌క్లబ్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆవిర్భావ సదస్సు ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ సలహాదారులు పాలడుగు విజేంద్ర బహుజన్, బ్లూవింగ్స్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శివరామకృష్ణ, ప్రజా రచయిత డాక్టర్ మొగిలి దేవప్రసాద్, రాష్ట్ర కోశాధికారి సీహెచ్ రాజేష్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కమిటీ సభ్యులు ప్రధాన కార్యదర్శి యలమందబాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు మరింత ఆసరా

అరకొర వసతులతో పరాయి పంచన నడుపుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు మంచి రోజులు వచ్చాయి. కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వం ఇస్తున్న అద్దె పూర్తి స్థాయిలో సరిపడక ..సరైన మౌలిక సదుపాయాలున్న చోట అద్దె ఇళ్లు లభించక కార్యకర్తలకు ఇంత కాలం ఇబ్బందులు తప్పలేదు. వీటిని గుర్తించిన ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సిబ్బంది, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె పెంపు
- గ్రామీణ ప్రాంతాల్లో వెయ్యి, పట్టణ ప్రాంతాల్లో రూ.3 వేలు పెరిగిన అద్దె
- హర్షం వ్యక్తం చేస్తున్న నిర్వాహకులు



పొదిలి రూరల్:

అంగన్‌వాడీలకు ప్రభుత్వం శుభవార్తను అందించింది. అద్దె భవనాలలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల బాడుగ రుసుమును పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఫౌండేషన్ స్కూల్స్‌గా మారుస్తూ నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం, ఇప్పుడు వాటిని సౌకర్యవంతమైన కేంద్రాలుగా తీర్చిదిద్దే అంశంపై దృష్టి సారించింది. జిల్లాలో మొత్తం 2903 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో స్వంత భవనాలు ఉన్నవి 1158 కేంద్రాలు కాగా, అద్దె చెల్లిస్తున్న భవనాలు 1153 ఉన్నాయి. మిగిలిన భవనాలకు స్వంత భవనాలు లేకపోయినా అద్దె లేకుండా ఉచితంగా కేంద్రాలు నడుపుతున్నారు. వాటిలో చాలా చోట్ల షెడ్లు, పాత భవనాలు, ఇరుకు గదుల్లో కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి స్టోర్ రూమ్ ఉండాలి. గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం నిల్వ చేసేందుకు, ప్రీ స్కూల్ కిట్లను భద్ర పరచేందుకు గదులు, అలాగే కిచెన్, మరుగు దొడ్లు ఉండాలి. ఆ వసతులు లేకపోవడంతో ఆయా కేంద్రాలకు వచ్చేందుకు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆసక్తి చూపేవారు కారు. కేంద్రాల నిర్వహణ భారంగా ఉండేది.

పెరిగిన అద్దె ఇలా...

అంగన్‌వాడీ అద్దె భవనాల కొత్త అద్దెలను ప్రభుత్వం నిర్దేశిస్తూ ఆదేశాలు జారీ చేసింది. గ్రామీణ ప్రాంతాలకు ఒక అద్దె ధరను, పట్టణాలకు, నగరాలకు వేర్వేరు ధరలను నిర్ణయిస్తూ ఆదేశాలు చేసింది. గ్రామీణ ప్రాంతంలో గతంలో రూ.వెయ్యి మాత్రమే అద్దె చెల్లిస్తుండగా దానిని తాజాగా రెట్టింపు చేసింది. రూ.2 వేలుకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇక పట్టణాలు గతంలో రూ.2 వేలు అద్దె ఇస్తుండగా దానిని రూ.4 వేలకు పెంపుదల చేసింది. ఇక నగరాల్లో గతంలో రూ.3 వేలు చెల్లిస్తుండగా తాజాగా ఇప్పుడు రూ.6 వేలకు పెంచింది. పెంచిన అద్దె ధరల ప్రకారం రెండు నెలలుగా చెల్లించాల్సిన అద్దెను పెంచి చెల్లించనున్నారు. అద్దె ధరలను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై అంగన్‌వాడీ సిబ్బంది హర్షం చేస్తున్నారు. దాదాపు దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న అద్దె ధరల పెంపుపై సంతోషాన్ని వెలిబుచ్చుతున్నారు.

అద్దె పెంపు ఇలా...

ప్రాంతం	గతం	ప్రస్తుతం (రూ.)
పల్లెలు (గ్రామీణ ప్రాంతాలు)	1000	- 2 వేలు
పట్టణాలు (మున్సిపాలిటీలు)	2 వేలు	- 4 వేలు
నగరాలు (కార్పొరేషన్‌లు)	3 వేలు	- 6 వేలు



గురుగుపాడులో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

జిల్లాలో మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు:	2903
స్వంత భవనాలు ఉన్నవి:	1158
అద్దె చెల్లిస్తున్న భవనాలు:	1153
ఉచితంగా ఉంటున్న భవనాలు:	592

పెరగనున్న వసతులు:

ప్రభుత్వం అద్దె రుసుము పెంచుతూ తీసుకున్న నిర్ణయంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో వసతులు కూడా పెరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఇరుకు గదుల్లో కేంద్రాల నిర్వహణ సాగుతుండగా తాజాగా పెంచిన అద్దెతో కొంత విశాలమైన భవనాలను అద్దెకు తీసుకొనే వెసులుబాటు అంగన్‌వాడీ నిర్వాహకులకు కలగనుంది. గ్రామీణ ప్రాంతాల్లో కొంత మెరుగైన వాతావరణం ఉన్నప్పటికీ పట్టణాలు, నగరాలలో మాత్రం చాలా చిన్న గదుల్లోనే కేంద్రాలు నడుస్తున్నాయి. ప్రభుత్వం అద్దె రుసుముతో ఇప్పుడు మరో గది అదనంగా లభించే అవకాశం ఉన్నట్లు అంగన్‌వాడీ సిబ్బంది పేర్కొంటున్నారు. తాజాగా కేంద్రాల అద్దె పెంచడంతో విశాలమైన కేంద్రాలు, తాగునీరు, మరుగుదొడ్లు ఉండే భవనాలను తీసుకొనే వెసులుబాటు లభించింది. చిన్నారులు ఆడుకోనేందుకు, చదువుకోనేందుకు వేర్వేరుగా గదులు ఉంటాయి. కేంద్రాలు పరిశుభ్రంగా, విశాలంగా ఉండటం వలన చిన్నారులు, గర్భిణులు కేంద్రాలకు రావడానికి ఆసక్తి చూపుతారు.



గొల్లపల్లిలో సొంత భవనంలో అంగన్‌వాడీ కేంద్రం

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి



అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వం నిబంధనలు పాటించాలి. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పెంచిన అద్దెకు అనుగుణంగా సౌకర్యాలు ఉండాలి. ముఖ్యంగా విశాలమైన గదులు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, మొదలైన వసతులు అందుబాటులోకి రానున్నాయి. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో అన్ని వసతులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

– వై ధనలక్ష్మి, ప్రాజెక్టు డైరెక్టర్, ఐసీడీఎస్, ఒంగోలు

ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు అద్దె పెంచుతూ నిర్ణయం తీసుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. ఎన్నో ఏళ్లుగా తక్కువ అద్దెతో ఇరుకు గదుల్లో కేంద్రాలు నిర్వహిస్తున్నాం. తమ బాధలను అర్థం చేసుకున్న ప్రభుత్వం ఎట్టకేలకు అంగన్‌వాడీ కేంద్రాల అద్దెను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎంతో సంతోషంగా ఉంది. అద్దె పెరగడం వలన విశాలమైన కేంద్రాలు, ఆడుకునేందుకు, చదువుకునేందుకు వేర్వేరుగా వసతులు సమకూరతాయి.

– ఏ శివకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త, గురుగుపాడు, పొదిలి మండలం.

గడప గడపలో ఆప్యాయత



31వ డివిజన్ మామిడిపాలెంలో ఇంటింటికీ తిరుగుతూ మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, పక్కన మేయర్ గంగాడ సుజాత, కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి

- వాసన్నా అంటూ ఆత్మీయ పలకరింపు
- సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా
- 31వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి

ఒంగోలు సబర్బన్: గడప గడపలో ఆప్యాయత... వాసన్నా అంటూ ఆత్మీయ పలకరింపు...ఇదీ ఒంగోలు నగరంలో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం తీరు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డిని కుటుంబ సభ్యునిలా ఆదరిస్తున్నారు. ఒంగోలు నగరంలో ఆదివారం 31వ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావుతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బాలినేని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన తీరును బాలినేని స్వయంగా అడిగి తెలుసుకుంటున్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు స్థానికులకు వివరిస్తున్నారు.

పింఛన్లు ఠంఛనుగా ఒకటో తేదీన వాలంటీర్ ఇంటికి వచ్చి ఇచ్చిపోతున్నారని వృద్ధులు, వికలాంగులు సంతోషంగా బాలినేనికి చెబుతున్నారు. కార్యక్రమంలో వ్యక్తిగత సమస్యలను కూడా బాలినేని దృష్టికి తీసుకొస్తున్నారు. దీంతో వెంటనే స్పందిస్తున్న బాలినేని పరిష్కరిస్తున్నారు. నిరుపేదల కోసం, వారి బంగారు భవిష్యత్తు కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంత ఖర్చయినా వెచ్చించి ఆదుకుంటామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మామిడిపాలెంలోని కృష్ణుడి దేవాలయంలో ప్రత్యేకంగా పూజలు చేశారు. మామిడిపాలెంలోని కొల్లిబోయిన వెంకయ్య మాస్టర్‌ను ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్‌లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు, ఏపీఐఐసీ కార్పొరేషన్ సభ్యులు మువ్వా స్వాతి, కార్పొరేటర్లు యనమల నాగరాజు, ఈదర చిన్నారి, గోపీ చంద్, జడా వెంకట్, తాడి కృష్ణలత, ఆదిపూడి గిరిజా శంకర శాండిల్య, నాగం వెంకట శేషయ్య, గోపిరెడ్డి గోపాల రెడ్డి, గోలి లక్ష్మీ కోటేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పుచ్చకాయల గోవర్ధన్ రెడ్డి, జాజుల కృష్ణ, జిల్లెళ్ళమూడి రమాదేవి, గుర్రం వెంకయ్య, వల్లెపు మురళి, దాసరి కరుణాకర్, బొప్పరాజు జ్యోతి, గొర్రెపాటి శ్రీనివాసులు, మైనారిటీ బహబూబ్ బాష, పసుపులేటి శ్రీనివాసులు, విస్సు, మోడుబోయిన సురేష్, తమ్మినేని మాధవి, పోతంశెట్టి వెంకటరత్నం, బొమ్మినేని మురళి, తూము పద్మ, బైరెడ్డి అరుణ, బేదపూడి రాజేశ్వరి, చింతగుంట్ల సువర్ణ, చిట్టిబోయిన రమణమ్మ, మరియమ్మ, సాదం విజయలక్ష్మి, అక్కిరెడ్డి, గోలి తిరుపతి రావు, దేవరపల్లి అంజిరెడ్డి, తూము వెంకట్రావు, నజీరు, మీరావలి, 31వ డివిజన్ నాయకులు మిడసల మధు బాబు, గుంజి ఏడుకొండలు, బందారు శ్రీరాములు, కొమ్ము రవి, బందారు మల్లిఖార్జునరావు, విసు, బడుగు ఇందిర, కొమ్మూరి రవిచంద్ర, కొమ్ము రాజీవ్, దాసు, విజయ, కుమారు, కట్టా రాజు, రమాకృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సంపూర్ణ సహకారం అందిస్తా



వాలీబాల్ పురుషుల జట్టును అభినందిస్తున్న శిద్దా సూర్యప్రకాశరావు తదితరులు

- వ్యాపారవేత్త శిద్దా సూర్యప్రకాశరావు

ఒంగోలు: క్రీడాకారులకు సంపూర్ణ సహకారం అందిస్తానని ప్రముఖ వ్యాపారవేత్త శిద్దా సూర్యప్రకాశరావు అన్నారు. స్థానిక పాటిబండ్ల గోపాలస్వామి కళ్యాణమండపంలో ఆదివారం నిర్వహించిన వాలీబాల్ క్రీడాకారుల అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా చరిత్రలో తొలిసారిగా వాలీబాల్ పురుషుల క్రీడాజట్టు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం ఆనందంగా ఉందన్నారు. వాలీబాల్ క్రీడాకారులకు అవసరమైన శిక్షణ కోసం స్థానిక రైజ్ కాలేజీ ఎదురుగా తాము నిర్మించిన హోటల్ ఆవరణలోని వాలీబాల్ కోర్టులో అవకాశం కల్పిస్తామన్నారు. శిక్షణ పొందడంతోపాటు ఉచిత వసతి, భోజన సౌకర్యం కూడా అందిస్తామన్నారు. క్రీడాకారులు క్రీడలతోపాటు విద్యపై కూడా దృష్టిసారించాలని, తద్వారా ఉన్నత అవకాశాలను మరింత మెరుగ్గా పొందగలరన్నారు. వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సూదనగుంట కోటేశ్వరరావు మాట్లాడుతూ వాలీబాల్ జూనియర్స్ విభాగంలో ఇప్పటికి హ్యాట్రిక్ సాధించామని, కానీ పురుషుల (సీనియర్స్) విభాగంలో మాత్రం రాష్ట్ర స్థాయిలో ప్రకాశం జట్టు ప్రథమస్థానంలో నిలవడం మాత్రం కలగా మిగిలిందన్నారు. తాజాగా పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రకాశం జట్టు విజయాన్ని అందుకుందన్నారు. క్రీడాకారులకు క్రీడతోపాటు వారికి ప్రోత్సాహం కూడా ముఖ్యమని, ఆ ప్రోత్సాహాన్ని అందించేందుకు ముందుకొచ్చిన దాతలకు వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి మందువ ఆంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు. మౌర్యా మెడికల్స్ అధినేత కొల్లూరి మారుతీరావు మాట్లాడుతూ క్రీడాకారులకు క్రీడా దుస్తులు అందించడంతోబాటు కోచింగ్ క్యాంపు సమయంలో తమ మౌర్యా ట్రీటీ నుంచి భోజనం కూడా ఉచితంగా అందిస్తామని ప్రకటించారు.

అనంతరం తాజాగా జూనియర్స్ విభాగంలో విజయపతాకం ఎగురవేసిన బాలబాలికల జట్లను, సీనియర్ పురుషుల జట్లను అభినందించారు. కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ మాలకొండయ్య, ఉపాధ్యక్షుడు గంటా ధనుంజయరావు, అపర్ణ, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్రాభాస్కరరావు, ఫిజికల్ డైరెక్టర్ సుబ్బారావు, సోమినేని సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ నాటికి వెలిగొండ నీరిస్తాం..

- రాబోయే నాలుగైదు నెలల్లో రెండో సొరంగ నిర్మాణం పూర్తి
- కరోనా దెబ్బతో రెండేళ్ల పాటు పనులు పూర్తి స్థాయిలో నిలిచాయి
- తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి
- ప్రాజెక్టు అధికారులు, కాంట్రాక్టర్లతో పనుల పురోగతిపై సమీక్ష
- మంత్రి సురేష్‌తో కలిసి ప్రాజెక్టు పనులు పరిశీలించిన టీటీడీ చైర్మన్



వెలిగొండ ప్రాజెక్టుపై అధికారులతో సమీక్షిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఆదిమూలపు సురేష్



ప్రాజెక్టును సందర్శిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఆదిమూలపు సురేష్, కేపీ నాగార్జునరెడ్డి

పెద్దదోర్నాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టును ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి పూర్తి చేసి మూడు జిల్లాల ప్రజలకు నీరందించేలా చర్యలు తీసుకుంటామని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొత్తూరు వద్ద జరుగుతున్న వెలిగొండ ప్రాజెక్టు సొరంగ నిర్మాణ పనులను ఆదివారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రెండో సొరంగ నిర్మాణ ప్రాంతం వద్ద అధికారులు, కాంట్రాక్టర్లతో పనుల పురోగతిపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన, మంత్రి సురేష్‌తో కలిసి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిర్లక్ష్యానికి గురైందన్నారు. నాడు ఐదేళ్ల కాలంలో ఒక కిలోమీటర్ పనులు కూడా చేయలేక పోయారన్నారు. మా ప్రభుత్వం అధికారంలోకొచ్చిన నాలుగేళ్ల కాలంలో ప్రాజెక్టు పనుల్లో ఎంతో పురోగతి సాధించామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన కొన్నాళ్లకే ప్రపంచ వ్యాప్తంగా కరోనా మహమ్మారి విజృంభించిందన్నారు. కరోనా దెబ్బతో దురదృష్టవశాత్తు ప్రపంచ వ్యాప్తంగా రెండేళ్ల పాటు పనులన్నీ నిలిచిపోయాయన్నారు. ఈ క్రమంలోనే వెలిగొండ ప్రాజెక్టు పనులు కూడా కరోనా దెబ్బకు నిలిచాయన్నారు. కరోనా నుంచి కోలుకున్న తర్వాత పూర్తి స్థాయిలో పనులు జరగటం వల్ల మొదటి సొరంగ నిర్మాణాన్ని పూర్తి చేశామని చెప్పారు. రాబోయే నాలుగైదు నెలల్లో రెండో సొరంగ నిర్మాణ పనులు కూడా పూర్తి కానున్నాయని అన్నారు.

నల్లమల సాగర్ రిజర్వాయర్‌లో రెగ్యులేటర్ పనులు కొద్దిమేర జరగాల్సి ఉందని ఆయన తెలిపారు. ఆ పనులను కూడా పూర్తి చేసి నీరందిస్తామన్నారు. ఇప్పటికీ మొదటి సొరంగం ద్వారా నీరందించే అవకాశం ఉందన్నారు. అయితే ప్రాజెక్టులోని రిజర్వాయర్‌లో రెగ్యులేటర్ పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. ప్రాజెక్టు కింద ముంపునకు గురవుతున్న 7200 కుటుంబాలకు పునరావాసం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. వైఎస్సార్ జలయజ్ఞంలో ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయటానికి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రణాళికతో పని చేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రకాశం నెల్లూరు, కడప జిల్లాలోని 30 మండలాల్లోని 15 లక్షల మంది ప్రజలకు తాగునీరు, 4500 ఎకరాలకు సాగు నీరు అందించే ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు వెలిగొండ ప్రాజెక్టు అన్నారు. 2004లో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ ప్రాజెక్టు విలువ రూ.8 వేల కోట్లు అయితే ప్రస్తుతం రూ.6 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. ఎంతో ప్రాధాన్యత ఉన్న వెలిగొండ ప్రాజెక్టును నాడు తండ్రి ప్రారంభిస్తే నేడు తనయుడు పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తాడని ఆయన పేర్కొన్నారు. ఆర్ ఆర్ ప్యాకేజీలో ప్రతి ఒక్కరి న్యాయమైన కోరికను నెరవేరుస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక వాహనంలో రెండో సొరంగ మార్గంలో ప్రయాణించి సొరంగ నిర్మాణ పనులను వారు పరిశీలించారు.

సమీక్ష సమావేశంలో ప్రజాప్రతినిధులతో పాటు ఇరిగేషన్ ఎస్ఈ అబూతాలిం, సీఈ ఆర్.మురళీనాథ్‌రెడ్డి, భూసేకరణ, ఆర్ఆర్ ప్యాకేజీ స్పెషల్ కలెక్టర్ సరళా వందనం, కంభం ఈఈ, ప్రభాకర్, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు. వైవీ సుబ్బారెడ్డి, ఆదిమూలపు సురేష్‌ల వెంట మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, శ్రీశైలం దేవస్థానం కమిటీ సభ్యురాలు చప్పల్లి కనకదుర్గ, యర్రగొండపాలెం ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, గంటవానిపల్లె సర్పంచ్ యక్కంటి రమాదేవి, శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అమ్మిరెడ్డి రామిరెడ్డి, పెద్దారవీడు మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, పెద్దదోర్నాల మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి, జెడ్పీటీసీ యేర్వ చలమారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, యర్రగొండపాలెం సచివాలయాల మండల కన్వీనర్ జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు 167 మంది గైర్హాజరు


పరీక్షలను పరిశీలిస్తున్న డీఈఓ

ఒంగోలు: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు 167 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం 15 సెంటర్లలో ఈ పరీక్ష జరిగింది. జిల్లా విద్యాశాఖ అధికారి బి.విజయభాస్కర్ పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. మొత్తం 3387 మందికిగాను 3220 మంది హాజరయ్యారని, పరీక్ష పూర్తి ప్రశాంత వాతావరణంలో జరిగినట్లు పేర్కొన్నారు.

రేపు దోర్నాలలో ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన

పెద్దదోర్నాల: ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు మంగళవారం పెద్దదోర్నాల మండలంలో పర్యటించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు ఓ ప్రకటనలో తెలిపారు. పెద్దచేమ గిరజన గూడెంలో గిరిజనుల సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తారని పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో మందుల విక్రయం చట్టవిరుద్ధం

ఒంగోలు అర్బన్: ఆన్‌లైన్‌లో మందుల విక్రయాలను వ్యతిరేకిస్తూ కార్పొరేట్ కంపెనీలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 15వ తేదీ నుంచి మార్చి 15వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కెమిస్ట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పావులూరి శ్రీధర్ తెలిపారు. ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో నిరసన కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం వరకు నగరంలోని మెడికల్ షాపులు మూసి వేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆన్‌లైన్ మందుల అమ్మకాలపై ఇంకా చట్టం రూపొందించలేదని, అయినా ఆన్‌లైన్‌లో మందులు విక్రయించడం సరికాదన్నారు. దీనివల్ల ప్రజలకు డూప్లికేట్, కాలం చెల్లిన మందులు సరఫరా అయ్యే అవకాశం ఉందన్నారు. సమావేశంలో అసోసియేషన్ వ్యవస్థాపక మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, వై.బాలు, వేమూరి సుబ్బారావు, వెంకారెడ్డి, మధుసూదన్‌రావు, కొల్లా మధు, వెంకట్రావు, సతీష్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ అదృశ్యం

● కేసు నమోదు

మార్కాపురం: తల్లీబిడ్డ అదృశ్యంపై స్థానిక రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. గత నెల 30 నుంచి తన భార్య మార్తమ్మ, కుమార్తె ఏసు మరియమ్మ కనిపించడం లేదని దేవరకొండ కాశయ్య ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

ఈతకు దిగితే పతకాలే


మెడల్స్‌తో శ్రీనివాసరావు

పొదిలి రూరల్: ఈతపై (స్విమ్మింగ్) మక్కువతో కఠోర సాధన చేసిన ఆ యువకుడు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో ఎన్నో పతకాలు సాధించాడు. త్వరలో శ్రీలంకలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యా డు. పొదిలి మండలం ఉప్పలపాడు పంచాయతీ గోగినేనివారిపాలెంకు చెందిన గోపనబోయిన శ్రీనివాసరావు ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన 5వ ఆలిండియా మాస్టర్ గేమ్స్‌లో చాంపియన్‌సిప్ పోటీల్లో పాల్గొన్నాడు. పోటీల్లో మొత్తం ఐదు విభాగాల్లో పాల్గొని ఐదు పతకాలు సాధించాడు. నిర్వాహకులు పాండురంగారావు, సింగ్, లూకాస్ విజేతలకు ప్రశంసా పత్రాలుతో పాటు మెడల్స్ అందజేశారు.

సెక్యూరిటీ గార్డు ఆత్మహత్య


మృతుడు రామకృష్ణారెడ్డి

మార్కాపురం: పట్టణంలోని ఓ కళ్యాణ మండపంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న అవివాహిత యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ఆదివారం మార్కాపురం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో చోటుచేసుకుంది. కాలనీకి చెందిన ఇండ్ల రామకృష్ణారెడ్డి(25) ఆదివారం రాత్రి తన ఇంట్లోనే ఉరికి వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. ఆత్మహత్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పట్టణ ఎస్సై శశికుమార్ తెలిపారు.

ప్రజా సహకారంతో ఆలయాల అభివృద్ధి

● టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ● గొడ్రాలికొండ తిరుమలనాథ ఆలయ పునఃనిర్మాణానికి భూమిపూజ


ఆలయం ప్రాంగణంలో భూమి పూజ చేస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి


గోమందిరాన్ని ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, పక్కన మంత్రి సురేష్, ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

పెద్దారవీడు: ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు సహాయ సహకారాలు అందించాలని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పెద్దారవీడు మండలం చట్లమిట్ల పంచాయతీలోని రాజంపల్లి సమీపంలో రాజ్యలక్ష్మి సమేత గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయ పునఃనిర్మాణానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డితో కలిసి టీటీడీ చైర్మన్ వైవీ భూమి పూజ చేశారు. అనంతరం వైవీ గోమందిరాన్ని ప్రారంభించారు. తదనంతరం కేంద్రియ విద్యాలయాన్ని సందర్శించారు. తొలుత అర్చకుడు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో టీటీడీ చైర్మన్, మంత్రి, ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం వారిని ఆలయ చైర్మన్ దుద్దెల వెంకటరెడ్డి, ఈఓ చెన్నకేశరెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలందరి సహకారంతో తిరులనాథస్వామి నిర్మాణ పనులు చేపట్టడం శుభపరిణామమని, స్వామివారి చల్లని దీవెనలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. దేవదాయ శాఖలో నిధుల కొరత కారణంగా ఆలయ పునఃనిర్మాణానికి టీటీడీ తరఫున రూ.70 లక్షలు మంజూరు చేయించానని వివరించారు. ఆలయ నిర్మాణం కోసం తనవంతు సహకారం ఎప్పటికీ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు. గోవులకు సేవ చేస్తే గోవిందునికి సేవ చేసినట్లని అభిప్రాయపడ్డారు.

కేంద్రియ విద్యాలయం అభివృద్ధికి చర్యలు

తాను ఎంపీగా ఉన్న సమయంలో కేంద్రియ విద్యాలయం మంజూరు చేయించడంతోపాటు భవన నిర్మాణాలకు రూ.25 కోట్లు కేటాయించేలా చర్యలు చేపట్టినట్లు టీటీడీ చైర్మన్ వైవీ గుర్తు చేశారు. 2023–24లో కేంద్రియ విద్యాలయం నూతన భవనాల్లో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఫోన్‌లో సూచించారు. కేంద్రియ విద్యాలయంలో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని, విద్యాలయ ముఖ ద్వారం వద్ద బోర్డు ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్‌కు చెప్పారు. విద్యాలయానికి తాగునీటి పైప్‌లైన్ కోసం రూ.14 లక్షలు, విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక నిధుల మంజూరు విషయమై సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. యర్రగొండపాలెం, మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల పరిధిలో వెలిగొండ ప్రాజెక్టు కింద ఉన్న ముంపు గ్రామాల నిర్వాసితుల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చిన తర్వాత ప్రాజెక్టులోకి నీటిని విడుదల చేస్తామన్నారు.

మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. తిరుమలనాథ ఆలయ అభివృద్ధికి నిధులివ్వాలని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని కోరగా వెంటనే స్పందించి మంజూరు చేశారని పేర్కొన్నారు. ఎంపీగా ఉన్న సమయంలో పశ్చిమ ప్రాంతం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన వైవీ సుబ్బారెడ్డికి ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారన్నారు. కేంద్రియ విద్యాలయం ఏర్పాటుకు ఎంతో కృషి చేశారని, సొంత నిధులతో విద్యార్థులకు బెంచీలు, వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వెలిగొండ నిర్వాసితులకు రూ.1400 కోట్లు విడుదల చేసి, మూడు జిల్లాల్లో 15 లక్షల మందికి తాగునీరు, 4.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా కృషి చేయాలని వైవీ సుబ్బారెడ్డిని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏర్వ అల్లూరమ్మ, ఎంపీటీసీ గోదాపు సబ్బమ్మ, మంత్రి తనయుడు విశాల్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు పాలిరెడ్డి కృష్ణారెడ్డి, కొప్పర్తి ఓబులరెడ్డి, సుబ్బారెడ్డి, ఎంపీపీలు బెజవాడ పెద్దగురవయ్య, కోట్ల సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, కౌన్సిలర్, శ్రీశైలం దేవస్థానం బోర్డు మెంబర్ డాక్టర్ చెప్పలి కనకదుర్గ, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, డాక్టర్ వీరనారాయణరెడ్డి, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, కందుల కాశిరెడ్డి, సాంబిరెడ్డి, పిచ్చయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

● ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణం
● భర్త, కుటుంబసభ్యులే చంపి ఉరేశారని తల్లిదండ్రులు ఆరోపణ


దివ్య మృతదేహం


రాపూరులో విచారణ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు


గుడ్లూరులో తెల్లవారుజామున పోలీస్ స్టేషన్ ముందు పడిగాపులు కాస్తున్న మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు

గుడ్లూరు: అత్తింటి వేధింపులు తాళలేక వివాహమైన ఆరు నెలలకే ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. అయితే అదనపు కట్నం ఇవ్వలేదని తమ కుమార్తెను భర్త, కుటుంబసభ్యులే చంపి ఆత్మహత్య అని చెబుతున్నారని యువతి తల్లిదండ్రులు ఆరోణలు చేస్తున్నారు. ఈ సంఘటన మండలంలోని రావూరులో శనివారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే.. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా దగదర్తి మండలం బోడగుడిపాడు గ్రామానికి చెందిన పోలుబోయిన రఘురామయ్య కుమార్తె దివ్యను మండలంలోని రావూరు గ్రామానికి చెందిన గొల్లప్రోలు వెంకటసుబ్బారావు కుమారుడు వెంకట రాజేంద్రకు ఇచ్చి ఆరు నెలలు క్రితం వివాహం చేశారు. వివాహ సమయంలో 18 సవర్ల బంగారం, ఎకరా పొలం, రూ 50 వేలు నగదు కట్నం కింద ఇచ్చారు. అయితే దివ్యకు ఎడమ చేయి కొంచం అంగవైకల్యం ఉండటంతో గత కొన్ని రోజుల నుంచి అదనపు కట్నం తీసుకురావాలని భర్త రాజేంద్ర, అత్త, కుటుంబసభ్యులు వేధిస్తూ వచ్చారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం దివ్య(21) ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. చుట్టుపక్కల వారు గమనించి కిందకు దించి పనికి వెళ్లి భర్త, అత్తకు సమాచారం ఇచ్చారు. దివ్య మృతి చెందిన విషయాన్ని వారు రాత్రి 9 గంటలకు తల్లిదండ్రులకు తెలియచేశారు. వారు గ్రామానికి చేరుకొని బోరున విలపించారు. సమాచారం అందుకున్న సీఐ సుబ్బారావు, ఎస్సై ప్రసాదరెడ్డి రావూరుకు చేరుకొని సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. తమ కుమార్తెకు ఎడమ చేయి పనిచేయదని, అలాంటిది ఎలా ఉరేసుకుంటుందని, భర్త కుటుంబసభ్యులు అదనపు కట్నం కోసం చంపి ఉరేశారని మృతురాలు తల్లిదండ్రులు రఘురామయ్య, మాధవిలు అనుమానం వ్యక్తం చేశారు. రాత్రి 11.30 గంటలకు గుడ్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి బంధువులు 30 మందితో కలిసి రాగా పోలీసులు ఆదివారం ఉదయం 6 గంటలు వరకు కూడా ఫిర్యాదు తీసుకోలేదని రాత్రంతా మమ్మల్ని పోలీస్‌స్టేషన్ బయటే ఉన్నామని వాపోయారు. పోలీసులు నిష్పక్షపాతంగా కేసును విచారించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కందుకూరు డీఎస్పీ కండె శ్రీనివాసరావు ఆదివారం గ్రామానికి చేరుకొని సంఘటనా స్థలంలో విచారించారు. వరకట్న వేధింపులు కింద రాజేంద్ర, అతని తల్లి రామతులశమ్మ మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

సత్తా చాటిన కురిచేడు ఎడ్ల జత


పోటీలో పాల్గొన్న ఎడ్లజత

పెద్దారవీడు: దుర్గా సమేత భోగేశ్వరస్వామి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా పెద్దారవీడులో రాష్ట్రస్థాయి న్యూ కేటగిరి పశుప్రదర్శన పోటీలు ఆదివారం హోరాహారీగా సాగాయి. పోటీల్లో మొత్తం 13 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. ప్రకాశం జిల్లా కురిచేడు మండలం కాటంవారిపల్లె గ్రామానికి చెందిన కాటం పెద్దిరెడ్డి ఎడ్లజత 5301 అడుగులు లాగి ప్రథమస్థానంలో నిలిచి రూ.50 వేలు కైవసం చేసుకున్నాయి. గిద్దలూరు మండలం బురుజుపల్లె గ్రామానికి చెందిన యరదుల సోహిత్‌రెడ్డి ఎడ్లజత 4818 అడుగులు లాగి రెండవ స్థానం రూ.40 వేలు, నంధ్యాల జిల్లా గోస్పాడు మండలం జిల్లెల గ్రామానికి చెందిన గొటికె రవితేజరెడ్డి ఎడ్లజత 4750 అడుగులు లాగి మూడో స్థానం రూ.30 వేలు, కంభం మండలం దర్గా గ్రామానికి చెందిన మేకల రాజు ఎడ్లజత 4500 అడుగులు లాగి నాల్గో స్థానం రూ.20 వేలు, యర్రగొండపాలెం మండలం వీరాయపాలెం గ్రామానికి చెందిన దుదేకుల నజీర్‌బాషా ఎడ్లజత 4404 అడుగులు లాగి ఐదో స్థానం రూ.15 వేలు, వైఎస్సార్ కడప జిల్లా కలసపాడు గ్రామానికి చెందిన బెలు వెంకటరెడ్డి ఎడ్ల జత 4153 అడుగులు లాగి ఆరో స్థానం రూ.10 వేలు, దర్శి పట్టణానికి చెందిన గానుపెంట రాజశేఖరరెడ్డి ఎడ్ల జత 4041 అడుగులు లాగి ఏడో స్థానం రూ.8 వేలు, వైఎస్సార్ కడప జిల్లా కాశినాయన మండలం కోడిగుండ్లపాడు గ్రామానికి చెందిన లక్కిరెడ్డి అమరనాథ్‌రెడ్డి ఎడ్లజత 4002 అడుగులు లాగి ఎనిమిదో స్థానం రూ. 5 వేలు కైవసం చేసుకున్నాయి. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి

● సమగ్రశిక్ష రాష్ట్ర ఏఎస్‌పీడీ శ్రీనివాసులరెడ్డి


మొగళ్లూరులో తరగతి గదుల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసులురెడ్డి

వెలిగండ్ల: నాడు–నేడు రెండో దశలో భాగంగా రాష్ట్రంలో 22,239 పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు సమగ్రశిక్ష రాష్ట్ర అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ కేవీ శ్రీనివాసులరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని మొగళ్లూరు జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. ఇందులో భాగంగా ఇప్పటికే 1,578 కోట్లు నిధులు రివాల్వింగ్ ఫండ్‌గా విడుదల చేసి పనులు చేపట్టినట్లు తెలిపారు. రానున్న విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి జగనన్న విద్యాకానుక, విద్యార్థి కిట్లు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. బైజూస్ ప్రాజెక్టులో భాగంగా రాష్ట్రంలోని 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్స్ అందజేశామని, తద్వారా అత్యున్నత విద్యాప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్య పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను, అందులో చదువుతున్న విద్యార్థులను ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకుపోవడమే లక్ష్యంగా విద్యా పథకాలు అమలవుతున్నాయన్నారు. నూతన విద్యావిధానాన్ని అమలు చేస్తున్న తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, 6 రకాల పాఠశాలల ఏర్పాటు ద్వారా విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఈయన వెంట హెచ్‌ఎం రాజాల కొండారెడ్డి, ఓపెన్‌స్కూల్ కో ఆర్డినేటర్ బి. శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

ఆయుష్షు పోయండి

● రెండేళ్ల బాలుడికి పెద్ద జబ్బు
● ఆపరేషన్‌కు రూ.6 లక్షలు అవసరం
● నిరుపేద గిరిజనుడి ఇంట్లో పెద్దకష్టం
● ఆర్థిక సాయం కోసం ఎదురుచూపులు


వైద్యశాలలో చికిత్స పొందుతున్న యశ్వంత్ అభిరామ్



కడుపులో ఇన్‌ఫెక్షన్ చేరిన దృశ్యం

ఉలవపాడు: నిరుపేద గిరిజన కుటుంబం..కూలీనాలీ చేసుకొని ఏ రోజుకారోజు పూట గడుపుకునేవాళ్లు. ఉన్నంతలోనే వాళ్ల రెండేళ్ల కుమారుడిని చూసుకుంటున్నారు. ఇంతలో పిల్లోడు నలతగా ఉండటంతో వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేసి కడుపు లోపల పూర్తిగా ఇన్‌ఫెక్షన్ అయి చీము చేరిందని, వెంటనే ఆపరేషన్ చేయాలని తేల్చారు. కూలీనాలీ చేసుకొని జీవనం సాగించే ఆ కుటుంబం..ఆపరేషన్ చేయించే స్తోమత లేక కుమారుడి పరిస్థితి చూడలేక తల్లడిల్లుతున్నారు.

ఆపరేషన్ చేస్తేనే..

ఉలవపాడులో వరిగ చేను సంఘం ఎస్టీ కాలనీకి చెందిన మానికల మురళీకి రెండేళ్ల కుమారుడు జశ్వంత్ అభిరామ్. అభిరామ్‌కు 15 రోజుల క్రితం కడుపులో నొప్పిగా ఉండటంతో స్థానికంగా ఆర్‌ఎంపీ వద్ద, ప్రభుత్వ వైద్యశాలలో చూపించారు. ఇన్‌ఫెక్షన్ సోకిందని మందులు వాడారు. అయినా ఫలితం లేక విపరీతమైన కడుపునొప్పి భరించలేక పొట్ట లావుగా మారడంతో ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలలో చూపించారు. అక్కడ పరీక్షలు చేసి.. ఆపరేషన్ చేయాలని విజయవాడలోని అంకుర హాస్పిటల్‌కు పంపించారు. చేతిలో డబ్బులు లేక పోవడంతో సంఘంలో డబ్బులు తలాకొంత వేసుకొని వైద్యశాలకు తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. అక్కడ ఇన్‌ఫెక్షన్ సోకిందని కడుపులోని చీమును తొలగించారు. అయినా మళ్లీ ఏర్పడుతూనే ఉంది. ఊపిరితిత్తులు, గుండెకు కూడా ఇన్‌ఫెక్షన్ చేరిందని వైద్యులు తెలిపారు. త్వరగా ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. ఆ ఆపరేషన్ ఆరోగ్యశ్రీ పరిధిలో లేదు.

సాయం కోసం ఎదురుచూపులు

నిరుపేద గిరిజన కుటుంబం కావడంతో ఒక్కగానొక్క బిడ్డను కాపాడుకోవడం కోసం ఆ తండ్రి దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. ఆపరేషన్‌కు రూ.6 లక్షల వరకు అవసరం కావడంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. దాతలు ఆదుకుంటేనే ఆ రెండేళ్ల బిడ్డ సంతోషంగా తిరిగి వస్తాడు. విజయవాడలోని ఆ ప్రైవేట్‌లోని వైద్యులు సైతం ముందుగా వారి పరిస్థితి గమనించి వారు కొంత నగదు వేసుకొని మందులు ఇచ్చారు. సాయం చేయాలనుకునే దాతలు తన తమ్ముడు అశోక్ ఫోన్ పే నంబర్ 6301120664కు దాతలు సాయం చేయాలని కోరుతున్నారు.

రోటావేటర్‌లో పడి బాలుడు మృతి


బాలుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

అద్దంకి రూరల్: గడ్డి కత్తిరించే రోటావేటర్ మిషన్‌లో పడి బాలుడు మృతి చెందాడు. ఈఘటన మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఘటన స్థలానికి చేరకున్న సీఐ, ఎస్సై వివరాలను సేకరించి కేసు నమోదు చేశారు. సీఐ రోశయ్య తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన మునగంటి వీరాచారి ఇంటికి సమీపంలో గడ్డిని యంత్రంతో కట్ చేస్తున్నారు. ఈక్రమంలో కుమారుడు మునగంటి అవేష్ (12) ఆదివారం మిషన్‌కు వెనుక వైపు ఉన్న చక్రం పైభాగంలో బాలుడు అవేష్ కూర్చుని చూస్తున్నాడు. ఈ నేపథ్యంలో జారి పడ్డాడు. కాళ్లు, నడుము కట్ అవడంతో బాలుడు అక్కడిక్కడే మృతి చెందాడు. అప్పటివరకు ఇంట్లో ఉన్న కుమారుడు మృతి చెందటంతో తల్లిదండ్రులను ఆపతరం ఎవ్వరివల్ల కాలేదు.